

ఉపాధ్యాయుడు విజయరత్నంకు డాక్టరేట్


అవార్డు తీసుకుంటున్న విజయరత్నం

కిర్లంపూడి : సౌత్ ఆఫ్రికాకు చెందిన ఎపిక్రైజ్ ప్రాఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ మండలంలోని తామరాడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తిరగటి విజయరత్నంకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వందన యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు పులి ప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విజయరత్నం డాక్టరేట్‌ను అందుకున్నారు. పద్య, వచన, శతక రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచినందుకు కాక, సామాజిక సేవాతత్పరత కలిగినందుకు డాక్టరేట్‌ను అందజేసినట్లు పులి ప్రసాద్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ, స్టాఫ్ సెక్రటరీ బి.నూకరాజు, ఉపాధ్యాయులు రామ్మోహన్, గ్రామ పెద్దలు విజయరత్నంను అభినందించారు.

క్రీడలకు ఏదీ ప్రోత్సాహం..?

- వేసవి క్రీడా శిబిరాలకు మొండి చేయి
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- నిరాశలో విద్యార్థులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయడం లేదు. గత వైసిపి పాలనలో క్రీడలను కనీసంగా ప్రోత్సాహం లేకుండా పోయింది. కూటమి సర్కార్ అయినా క్రీడలపై దృష్టి సారించి ప్రోత్సాహం ఇవ్వాలని కోచ్‌లు, క్రీడాకారులు కోరుతున్నారు. పేద విద్యార్థులు క్రీడలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ శిబిరాల్లో ఐదు నుంచి 15 ఏళ్ల బాలురకు వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, బాలికలకు బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తారు. క్రీడా విభాగం సిబ్బందితో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8.30 వరకు, సాయంత్రం 4 నుంచి 7.30 వరకు 6 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు శిక్షణ ఉంటుంది. ఇలా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. గత 20 ఏళ్లుగా కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డిఎస్ఎ) క్రీడా మైదానంలో ఏటా వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను వివిధ క్రీడల్లో తీర్చి దిద్దుతున్నారు. గతేడాది నిర్వహించిన వివిధ శిబిరాల్లో సుమారు 2000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయని ప్రభుత్వం

వేసవి క్రీడా శిబిరాలకు ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి నిధులు విడుదల చేయడం లేదు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుంటున్న నేపథ్యంలో అరకొర సొమ్ములే వస్తున్నాయి. అవి ఏ మూలకూ సరిపోని పరిస్థితి. ఏటా శిక్షణ శిబిరాలపై అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాతలు, కొంతమంది క్రీడాకారులు, కోచ్‌ల సొంత సొమ్ములు వెచ్చిస్తున్న నేపథ్యంలో శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఏటా 100 శిబిరాలను నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా తీసుకుంటున్నారు. కానీ 50 మాత్రమే నిర్వహిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో క్రీడాకారులు కూడా ఆసక్తి కనబరచకపోతున్నారు. జిల్లాకు ఈ ఏడాది ప్రత్యేకంగా 50 శిక్షణ శిబిరాలు నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కార్యాచరణను సిద్ధం చేశారు. రూ.300 నుంచి రూ.500 వరకు రిజిస్ట్రేషన్ ఫీజును వసూలు చేస్తారు. క్రీడా సంఘాలు పిఇడిలు, పిఇటిలు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. అయితే ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు కొందరు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, సరైన ఏర్పాట్లు చేయకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఆట వస్తువులు, కోచ్‌లకు పారితోషికాలు, తాగునీరు, ఉదయం, సాయంత్రం అల్పాహారం వంటివి కూడా ఇవ్వడం లేదు. క్రీడాకారులే ఇవన్నీ సమకూర్చుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి శిక్షణ శిబిరాల వద్ద మంచినీరు, క్రీడా పరికరాలు వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. గతంలో ఒక శిబిరం నిర్వహిస్తే కోచ్‌కు ప్రోత్సాహకంగా రూ.2 వేలు పారితోషికం ఇచ్చేవారు. ఆట వస్తువులకు రూ.7 వేలు, గ్రౌండ్ నిర్వహణకు రూ.1000 ఇచ్చేవారు. అయితే గత ఇదేళ్లుగా వీటిని నిలిపివేశారు.

శిబిరాలు నిర్వహించే అవకాశం



వేసవి శిక్షణ శిబిరాలు వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించే అవకాశం ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సంవత్సరం 50 శిబిరాలను నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నాం. నెల రోజుల పాటు సాగనున్న వేసవి శిక్షణ శిబిరాల అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తాము. అయితే ప్రభుత్వం నుంచి కోచ్ కు రూ.5 వేలు, నిర్వహణకు రూ.1000 మాత్రమే వస్తున్నాయి.

-శ్రీనివాసరావు, జిల్లా క్రీడాభివద్ధి అధికారి, కాకినాడ.


ఐద్వా జాత ప్రారంభ కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఐద్వా నాయకులు

ఐద్వా ఆధ్వార్యాన జాతా ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామాజిక న్యాయం సమానత్వ సాధనకై ఐద్వా ఆధ్వర్యంలో 5వ జిల్లా జాతా శుక్రవారం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ నేటికీ దేశంలో సామాజిక న్యాయం లేదని, కుల, మహిళా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. స్త్రీ పురుష సమానత్వం కోసం మహిళలందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు సాధికారత సాధించాలంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం రావాలని అన్నారు. పూలే, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.గంగభవాని, దుర్గభవాని, భూలక్ష్మి, కె.అరుణ, పిబిఎ.ప్రభావతి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



వక్ఫ్ బిల్లు ఆమోదానికి నిరసనగా ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రదర్శన

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లింలు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. జుమ్మా నమాజ్ అనంతరం నిర్వహించిన ఈ ప్రదర్శన రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకూ సాగింది. అంతకుముందు మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ బిజెపి ప్రభుత్వం ముస్లింలపై వివక్షతో కూడిన విద్వేషాన్ని రేపుతోందన్నారు. అందులో భాగంగానే ఈ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. ముస్లింల సామాజిక, సాంస్కృతిక, ధార్మిక సంస్థలపై ఈ బిల్లు దాడిచేయనుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి ముక్తార్ అలీ, ఎండి ముస్తఫా, ఆశిక్ ఆలీ, సయ్యద్ ఖాదర్, షేక్ గౌస్, ఎం ఎల్ ఆలీ, నవాబ్ జానీ పాల్గొన్నారు. ఈ ర్యాలీకి సిపిఎం సంఘీభావంగా నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపరపు శ్రీనివాస్, క్రాంతికుమార్, అరుణ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెంలో పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని మహిళలు ఆందోళనకు దిగారు. శుక్రవారం స్థానిక రామాలయం వద్ద మహిళలు రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా పరిశుభ్రమైన తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీళ్లు కలుషితం అయి వస్తున్నాయని, అధికారులకు తెలియచేసినా ఫలితం లేదన్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

14న పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 14న జరగాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించినందున పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పాడా పీడీ చైత్రవర్షిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారుతెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి రాజశేఖరం

ఘనంగా ఎయిమ్ కిడ్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేళంగి ఎయిమ్ కిడ్ స్కూల్ 9వ వార్షికోత్సవం వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, రూరల్ కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఒత్తిడి లేని ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కేవలం విద్యకే విద్యార్థులను పరిమితం చేయకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై మక్కువ చూపేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఈ స్కూల్ నుంచి నవోదయకు ఎంపికైన విద్యార్థిని ఆక్షమ సత్యఈశ్వరిదేవిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎస్ఎ.గాడ్విన్, టిడిపి నాయకులు చంద్రు వెంకన్న రాయ్‌చౌదరి, మాజీ ఎంపిపి గుల్లిపల్లి శ్రీనివాసరావు, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపి సతీష్

మహాత్మ జ్యోతిరావ్‌పూలే జయంతిని శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగింది. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక జిజిహెచ్ సెంటర్లోని జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపి సానా సతీష్‌కుమార్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 200 ఏళ్ల తర్వాత కూడా ఒక వ్యక్తిని గుర్తు చేసుకుంటూ జయంతి వేడుకలు జరుపుకుటున్నామంటే ఆయన ఎంత గొప్ప వ్యక్తో అర్థం చేసుకోవాలన్నారు. వెనుకబడిన వర్గాల విద్య కోసం, మానవ హక్కుల కోసం పూలే ఎంతో పోరాడారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కొరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఎంతగానో కృషి చేశారని వారి స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిసి, కాపు, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా సుమారు రూ.11.86 కోట్ల రుణాలను 513 మంది లబ్ధిదారులకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమాధికారి ఎం.లల్లి, బిసి కార్పొరేషన్ ఇడి అద్దంకి శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, బిసి సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు. జెఎన్‌టియుకెలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య స్కాన్స్ సిఎండి డాక్టర్ కె.వెంకటరమణ, రెక్టార్ ప్రొ కెవి.రమణ, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొ వి.రవీంద్రనాథ్, ఒఎస్ ప్రొ డి. కోటేశ్వరరావు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కాకినాడ రూరల్** తొలితరం సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని గ్రంథాలయ సంస్థ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు అన్నారు. గురువారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులు, అనాధ పిల్లల కోసం దేశంలోనే తొలిసారిగా శరణాలయం స్థాపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, ప్రసాద్‌నాయుడు, దిలీప్‌కుమార్, రాజా పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్లగళ్ల దొరబాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **రౌతులపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపిడిఒ శివరామకృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎంపిడిఒ కె.స్వప్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సాగర్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ రాజు, ఎఒ జి.వెంకటరామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. **పిఠాపురం** టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్.వర్మ, వైసిపి కార్యాలయంలో మాజీ ఎంపి వంగా గీత, ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కేశవరావు, ఎల్ఐసి కార్యాలయంలో మేనేజర్ రాము పూలే చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **తాళ్లరేవు** స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ నాయకుడు విప్పర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపిటిసి సభ్యులు పోతుల రత్నకుమారి, ప్రజాసంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, ఇతర నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన పూలే జయంతి వేడుకల్లో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్బు, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి రవివర్మ, సిఐటియు నాయకులు బుడతా రవీంద్ర, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, దేవత రాజేష్‌కుమార్, కూనిరెడ్డి నరసింహంమూర్తి, అమృత, నమ్రత పాల్గొన్నారు. అలాగే స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీరమణి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, ధర్మవరంలో వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, అవసరాల దేవి, జోగా ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో నివాళురల్పిస్తున్న న్యాయవాదులు


కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - కాకినాడ

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. కాకినాడ అంబేద్కర్ భవనం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కెవిపిఎస్ సీనియర్ నేతలు ఎం.రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. దళిత, గిరిజన, బలహీన వర్గాలు అభ్యున్నతికి కృషి చేసి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పూలే సూచించారని అన్నారు. భారత జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు పూలే అని కొనియాడారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్‌కుమార్, కె.సింహాచలం, జిల్లా నాయకులు కె.పద్మనాభం, బి.రవికుమార్, ఎన్.రాజు, దళిత సంఘాల నాయకులు రవి, రాపాక రాధాకృష్ణ, జెవివి నాయకులు యు.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


కెవిపిఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కార్టూ'నిజం'



ఓటర్ జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితాపై బిఎల్‌ఒలు, ఇఆర్‌ఒలకు శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీరమణి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ ఓటర్ నివాసానికి 2 కిలోమీటర్ల దూరం మించి ఉండకూడదన్నారు. పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది లోపులో మాత్రమే ఓటర్లు ఉండాలన్నారు ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను వారం రోజులలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

ప్రజాశక్తి - సామర్లకోట

అన్ని వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య సాధ్యమని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ తరగతి పూర్తయిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కలిసి కోరారు. వారికి ప్రవేశ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కెవివి.సత్యనారాయణ, ఎఎల్‌వి.కుమారి పాల్గొన్నారు.


విద్యార్థికి ప్రవేశ పత్రాన్ని అందిస్తున్న హెచ్‌ఎం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలక్ష్మి

పోక్సోచట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఫోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జె.అన్నవరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లితండ్రులను తమ పిల్లలకు మంచి, చెడులపై అవగాహన కల్పించాలని అన్నారు చట్టంపై అవగాహన కల్పించడం ద్వారా ధైర్యంగా ముందుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్లో ఇప్పటివరకు 4 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు ఈ సదస్సులో టి.వీరన్న, కె.దైవకృప, సిబ్బంది బి.రాజేంద్రప్రసాద్, ఇ.జగదీష్, పి.నానిబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో- 2కె25

ప్రజాశక్తి - గండేపల్లి


వివిధ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎక్స్పో 2కె25 ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడమిక్స్) డా రమాశ్రీ, డీన్ డాక్టర్ సంజయ్ డోలా, విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంసిఎ 4వ సెమిస్టర్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ల్యాండ్ పర్సన్ అభ్యుదయ సంఘం కోరింది. శుక్రవారం స్థానిక వలసపాకల దుర్గమ్మ ఆలయం వద్ద సంఘ సమావేశం శివకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస పాకలు నుంచి ఎన్ఎఫ్‌సిఎల్ వరకూ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని వలసపాకల, సుందరయ్య కాలనీ, బొందగుంట ప్రాంతాల ప్రజలు కోరుతున్నారని, అయితే అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. నూతనంగా అనేక పరిశ్రమలను స్థాపిస్తున్నారని, అయితే స్థానికులకు ఆయా కంపెనీల్లో ఉపాధి కల్పించడం లేదని పేర్కొన్నారు. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉపాధి కల్పించాలన్నా జిఒను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరంజిల్లా పూసపాటిరేగ మండలంలోని చౌడమ్మ అగ్రహారం వద్ద జాతీయ రహదారి బ్రిడ్జిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు ప్రాంతానికి చెందిన నంబూరు నాగ సత్యలక్ష్మి (27) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త భార్గవ్‌రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం...బైక్ రైడర్ భార్గవ్ రాజా, నాగలక్ష్మి శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం నుంచి విహారయాత్రకు రోడ్డు మార్గంలో నేపాల్ బయల్దేరారు. ఉదయం 11 గంటల సమయంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మరణించింది. భార్గవ్ రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, రాజాను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సిహెచ్‌సికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిచి వెళుతున్న వ్యక్తిని మోటారుసైకిలిస్టు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని కొత్త కాలువకు చెందిన శీలం నాగేశ్వరరావు(54) గురువారం సాయంత్రం కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో యానాం నుండి వస్తున్న మోటార్ సైకిల్ లిస్ట్ అతనిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు ను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలు అందించిన తర్వాత ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం శుక్రవారం ముమ్మిడివరం ప్రయివేటు ఆసుపత్రికి తరలిస్తుండగా అతను మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య పద్మ ఉన్నారు. మృతుడు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్యాచారం కేసులో దోషికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి- చాగల్లు

బాలికపై అత్యాయారం కేసులో కోర్టు దోషికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన మతి స్థిమితం లేని బాలికపై 2017లో రాజమండ్రి నామవరానికి చెందిన నందా శ్రీను అత్యాచారం చేశారు. బాలిక తల్లి ఫిర్యాదుపై అప్పటి కొవ్వూరు డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నేరం రుజువైనందున ముద్దాయి శ్రీనుకు శుక్రవారం ఏలూరు పిఒసిఎస్ఒ కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

పతంజలి శాస్త్రికి సతీ వియోగం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


విజయలక్ష్మి

పర్యావరణవేత్త, ప్రముఖ రచయిత పతంజలి శాస్త్రికి సతీవియోగం కలిగింది. ఆయన భార్య తల్లావజల విజయలక్ష్మి (80) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆమె రాజకీయ శాస్త్ర అధ్యాపకురాలుగా ఉద్యోగం చేశారు. నగరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో 1968 సంవత్సరంలో అధ్యాపకురాలిగా చేరిన ఆమె 2005 వరకూ తమ సేవలు అందించారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం కోటిలింగాల ఘాట్‌లోని కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నం గ్రామానికి చెందిన చింతా గణేష్‌కు చెందిన తాటాకు ఇల్లు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ వల్ల మంటలు చెలరేగి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కుటుంబికులు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. ఇంటిలోని అన్ని వస్తువులు దగ్ధం అయ్యాయని, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే గ్రామ టిడిపి నాయకులు మన్యం ప్రసన్నకుమార్, పెనుమర్తి దొరబాబు, కల్తూరి శ్రీను, సానిపిని సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పన్ను బకాయి చెల్లింపు గడువు పొడిగింపు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు, ఖాళీస్థలాల బకాయిలపై ఉన్న వడ్డీని 50 తగ్గిస్తూ ఇచ్చిన వడ్డీ రాయితీ సౌకర్యాన్ని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ గల బకాయిలపై ఉన్న వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని బకాయిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఏక మొత్తంలో బకాయిలు చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని వినియోగించుకోవాని సూచించారు. ప్రస్తుత సంవత్సరం మాత్రమే పన్ను చెల్లించాల్సిన వారు ముందస్తుగా పన్ను చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోషణ్ పక్వాడా

ప్రజాశక్తి-పెరవలి

ఖండవల్లి ఐసిడిసి ప్రాజెక్ట్ సెక్టార్ పరిధిలో లంకమాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం సెక్టార్ సూపర్వైజర్ సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

యానాం వార్తలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న అధికారులు, అభిమానులు

అంబేద్కర్ జయంతి వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. నెహ్రూ యువ కేంద్ర, సుభాష్ చంద్రబోస్ ఐటిఐ కళాశాల ఎన్‌ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఐటిఐ ఎన్ఎస్ఎస్ పిఒ వాసంశెట్టి ఆనంద్, లంక ప్రసాద్, మన్నే కిరణ్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ విభాగం కో- ఆర్డినేటర్ డాక్టర్ తాతపూడి ముత్యాలు ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమలో రిటైర్డ్ సీనియర్ అకౌంటెంట్ లంక లావరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు బాస్కర్‌రెడ్డి, తోట ప్రసాద్‌రావు పాల్గొని మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన్ భవన్లో ఏప్రిల్ 13న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు


ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్, మల్లాడి కృష్ణారావు

ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణంలో సాయ్ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణం నుంచి ఫెర్రీ రోడ్డు వరకు సైక్లింగ్ ర్యాలీ చేశారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

జెఎన్‌టియుకెలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణంలో శుక్రవారం ఐఐఐపి అండ్ టి డైరెక్టరేట్ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. తొలుత అరబిందో ఫార్మా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు, ఉపకులపతి ప్రొ సిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొ వి.రవీంద్రనాథ్ కంపెనీ కార్యకలాపాలను వివరించారు. పూల్ క్యాంపస్ డ్రైవ్లో భాగంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో 4 నెలల పాటు స్టయిఫండ్‌తో కూడిన శిక్షణనిచ్చి కంపెనీకి చెందిన యూనిట్లలో పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఎంటెక్ కోర్సులు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని, అలాగే ఎం. ఫార్మశీ కోర్సులు నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, దీని ద్వారా పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం జరుగుతుందని విసి తెలిపారు. ఈ డ్రైవ్లో అరబిందో ఫార్మా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఐఐఐపిటి డైరెక్టర్ ప్రొ బిటి.కృష్ణ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ డైరెక్టర్ ప్రొ కె.పద్మప్రియ తెలిపారు. ఈ డ్రైవ్‌లో 200మంది హాజరయ్యారని, వీరిలో 150మంది ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించి టెక్నికల్ రౌండ్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా లిమిటెడ్ కంపెనీ సీనియర్ మేనేజర్లు లీలా మాధురి, వెంకటేష్, హెచ్ఆర్ మేనేజర్లు వీరేంద్ర, శ్రవణ్, జెఎన్‌యుకె ఫార్మశీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరుతున్న అధ్యాపకులు

కళాశాలలో మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాజులూరు, మంజేరు, శీల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సౌకార్యలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, దీంతోపాటు ప్రభుత్వం అనేక సౌకర్యాలను విద్యార్థులకు కల్పిస్తుందని తెలిపారు. కావున విద్యార్థులున ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కాప శ్రీనివాస్, సిహెచ్.శ్రీనుబాబు పాల్గొన్నారు.


నిర్వాహకులకు స్టేషనరీని అందిస్తున్న దాతలు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న పాలిసెట్ ఉచిత శిక్షణా శిబిరం విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను బహుకరించారు. మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కటకం మణికుమార్ వారి తల్లిదండ్రులు కటకం వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కటకం నాగలక్ష్మి స్వయంగా విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, మిషన్, కటకం మణికుమార్, కూనిరెడ్డి అప్పన్న, అమృత, నమ్రత, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 350 మంది ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 350 మంది యువతీ, యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు 800 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. వీరిలో 350 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చేతులు మీదుగా ఎంపికైన యువతీ, యువకులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పాల్గొని మాట్లాడారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక మెగా జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో వికాస ఆధ్వర్యంలో స్కిల్స్‌పై అవగాహన కల్పించి జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. రాజ్యసభ సభ్యులు సాన సతీష్ మాట్లాడుతూ గత 9 నెలల కాలంలో జిల్లాలో 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఆర్‌డిఒ శ్రీ రమణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఉత్సాహంగా గుర్రాల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - గొల్లప్రోలు


ఉత్కంఠగా సాగుతున్న గుర్రపు పందేలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో పుంత రోడ్డులో సీతారామస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన గుర్రపు పందాలు కిలోమీటర్ నర దూరం ప్రదర్శనలో రాష్ట్రం నలుమూలల నుంచి 30 గుర్రాలు పాల్గొన్నాయి ఈ గుర్రపు పందాలు చూడడానికి వేలాదిమంది ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఉత్కంఠ భరితంగా సాగాయి రాష్ట్రస్థాయి గుర్రపు పరుగు పందాల ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిన చేనుం అగ్రహారంకు చెందిన మణి(జెస్సీ)కి రూ.25 వేలు, చోడమాంబిక విక్రమం రామన్నపాలెంకు చెందిన ద్వితీయ స్థానాన్ని సాధించిన విజేతకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో మోతమాంబ మురుగన్ అంకుపాలెంకు రూ.15 వేలు బహుమతులను అందజేశారు. ఓరుగంటి ముత్యాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు ఓరుగంటి స్వామి, గడ్డం బుజ్జి, ఓరుగంటి శ్రీను షీల్డ్‌ను బహుమతులను ప్రదానం చేశారు,


కొనసాగుతున్న సైనిక విన్యాసాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


యుద్ధ ట్యాంకులతో కాల్పులు చేస్తున్న సైనికులు

కాకినాడ బీచ్‌లో పెద్ద ఎత్తున ఉభయచర ల్యాండింగ్ డ్రిల్‌లో దాదాపు 1,000 మంది యుఎస్, భారతీయ సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్నికలెక్టర్ షన్మోహన్ సగిలి తిలకించారు. ఈ సందర్భంగా యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌ను కలిసి రెండు దేశాలు టైగర్ ట్రంప్ నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ కసరత్తు మునుపటి వాటిపై ఆధారపడి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. మా బలగాలు మునుపెన్నడూ లేనంతగా సన్నిహితంగా పని చేస్తున్నాయని,ఈ బంధం మరింత బలపడటాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.


కాన్సుల్ జనరల్‌కు స్వాగతం ఎలుకుతున్న కలెక్టర్


పూజలు చేస్తున్న ఆర్‌డిఒ శ్రీరమణి

మరిడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఆర్‌డిఒ శ్రీరమణి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఎసి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కాజులూరు

జాతరలు, తీర్థ మహోత్సవాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గొల్లపాలెం శివారులో గల ధనమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఈ నెల 16, 17 తేదీల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నియమ నిబంధనలు కచ్చితంగా పాటించేలా ఆలయ కమిటీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెలపాక సర్పంచ్ పోతు గనిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి పథకాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 4 గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచి నీటి పథకాలను శనివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని ఎంపిడిఒ శ్రీలలిత తెలిపారు. చదలాడ, తిరుపతి, తూర్పుపాక లు, మర్లావ గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.33.50 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను ఆయన ప్రారంభిస్తారన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో మెలగాలని మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వినాయక, సరస్వతీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎస్ఎంసి ఛైర్మన్ చిట్రా రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య దశలో విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ తీర్థం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామంలోని మరిడమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. గరగలు, డప్పులతో సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని ఎస్‌సి కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు మే 10వ తేదీ వరకూ OBMMS పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కె.స్వప్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.